గాంధీ మార్గం అనుసరణీయం

- జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్
- వాడవాడలా జాతిపిత వర్ధంతి కార్యక్రమాలు


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు

సీతమ్మధార: దేశానికి స్వాతంత్ర్యం అందించిన మహాత్మా గాంధీ శాంతియుత మార్గం అనుసరణీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం జాతిపిత వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముడు పాటించిన సత్యం, అహింస, శాంతి మార్గాలు, గ్రామ స్వరాజ్యం వంటి మూలతత్వాలు ప్రపంచానికి ఎంతో ఉపయుక్తమన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం–వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని చెప్పారు. తద్వారా అన్ని సంక్షేమ పథకాలు, పౌర సేవలు ప్రజల ముంగిటకు అందేలా చేసి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఆయన నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, కె.కామేశ్వరి, శశికళ, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, కె.వి.బాబా, డైరెక్టర్ రాయుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి


మురళీనగర్ వాకర్స్ పార్కులో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రమౌళి, ఇతర సభ్యులు

సీతమ్మధార: గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. డైరెక్టర్లు మాట్లాడుతూ మహాత్మా గాంధీ అనుసరించిన సత్యం, అహింస మార్గాలు భారత జాతికే కాకుండా ప్రపంచ దేశాల్లో ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో సీజీఎంలు ఎ.రవికుమార్, వి.వి.లలిత, డి.సుమన్, కల్యాణి, సింహాద్రి, జె.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, కార్పొరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయాలు నెరవేరుద్దాం

మురళీనగర్: మహాత్మా గాంధీ ఆశయాలను నెరవేరుద్దామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పిలుపునిచ్చారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో జాతిపిత వర్ధంతి, అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండి త్యాగ నిరతిని అలవరచుకోవాలన్నారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, ఎస్.బుచ్చయ్య, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎల్వీ సుధాకర్, కోశాధికారి జె.కూర్మారావు, ఉపాధ్యక్షుడు మళ్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శుభ తదితరులు


ఏపీఈపీడీసీఎల్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డైరెక్టర్లు

వైశాఖి స్పోర్ట్స్ పార్కులో..

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచ నేతలకు గాంధీజీ ఆరాధ్య దైవంగా నిలిచారన్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం సరికాదు


మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా గాంధీ సెంటర్ అధ్యక్షుడు, నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి, జాతిపితగా పేరు గడించిన మహాత్మా గాంధీ గురించి ఇటీవల మన దేశంలోనే అక్కడక్కడ కల్పిత కథనాలతో అసత్య ప్రచారం జరుగుతోందన్నారు. ఇది దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని, దేశ సమగ్రతకు, భవిష్యత్‌కు మంచిది కాదన్నారు. ప్రజలు, ప్రభుత్వం ఇటువంటి ప్రచారాలకు ఫుల్‌స్టాప్ పెట్టే చర్యలు చేపట్టాలని కోరారు. బుల్లయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, మానవతా సంస్థ చైర్మన్ ఆర్.సుదర్శనరావు, కృష్ణా యూనివర్సిటీ పూర్వ కులపతి ఎస్.రామకృష్ణారావులు మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాల గురించి వివరించారు. కార్యక్రమంలో గాంధీ సెంటర్ కార్యవర్గ సభ్యులు బి.ఎస్.శాస్త్రి, నరవ ప్రకాశరావు, బి.రామారావు, రాజశేఖర్, కె.వి.ఎస్.మూర్తి, జె.పి.శర్మ, బుల్లయ్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘స్పందన’కు 20 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

కంచరపాలెం: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జ్యోతిర్మయి సొసైటీ అండ్ ఓల్డేజ్ హోమ్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన రహదారిలో పేదలు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సొసైటీ చైర్‌పర్సన్ జి.లక్ష్మి మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. దాత పుష్పలత చేతుల మీదుగా జ్ఞానాపురం, కంచరపాలెం తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 300 మందికి దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శేషమణి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల స్టాళ్లకు డ్రా


డ్రా తీస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లోని స్టాళ్లకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో సోమవారం డ్రా తీశారు. ఉదయం 93 కార్డులకు, సాయంత్రం 75 కార్డులకు సంబంధించిన స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయించారు. పది రోజులకు ఒక సారి డ్రా తీస్తున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో రూ.35 వేల చోరీ


బాధిత రైతు ఆనందరావు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో నగదు చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా, డుంబ్రిగుడ మండలం పాడి గ్రామానికి చెందిన అరకు రైతు బి.ఆనందరావు తను పండించిన కూరగాయలను శుక్రవారం రాత్రి సీతమ్మధార రైతుబజార్‌కు తీసుకొచ్చారు. శని, ఆదివారాల్లో కూరగాయలు విక్రయించిన నగదు రూ.35 వేలను రైతుబజార్‌లో గిరిజనులకు ఇచ్చిన రూంలోని పెట్టెలో పెట్టారు. సోమవారం ఉదయం లేచి పెట్టె చూసే సరికి కనిపించకపోవడంతో ఎంవీపీ పోలీసులకు రైతు ఆనందరావు ఫిర్యాదు చేశారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు..’


50వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు వుడా కాలనీ–2 సచివాలయం(293) పరిధిలోని తెన్నేటినగర్, మురళీనగర్ ప్రాంతాల్లో సోమవారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా సంక్షేమ పథకాలను అమలు చేసి అవి నేరుగా లబ్ధిదారులకు అందే విధంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. పథకాల అమలు, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు నేరుగా అడిగి తెలుసుకోవడమే గడప గడపకు కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాయుడు శ్రీను, సూకరాజు, పైడి శ్రీను, 50వ వార్డు నాయకులు భగాతి విజయ్, కృష్ణారావు మాస్టర్, పాతపట్నం రామ్మోహన్, నారాయణ స్వామి, సీపాన రాము,శివరాం, ఏవీఎస్ రాజు, సోనీ, చిరంజీవి, జగన్నాథం, వేణు, నారాయణరావు, పూజారి రాము, మురళీధర్, ఎం.వి.రెడ్డి, సీనియర్ నాయకులు షేక్ బాబ్జీ, కె.చిన్నా, మెట్ట దమయంతి, జ్ఞానేష్, సునీల్, గురువోజీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ యూనియన్ జోనల్ కమిటీ ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న కొత్త కమిటీ సభ్యులు

గోపాలపట్నం: రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ యూనియన్ జోనల్ కమిటీ ఎన్నిక స్థానిక కుమారి కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. జోనల్ కమిటీ అధ్యక్షుడిగా జంగం జోషి, గౌరవ అధ్యక్షుడిగా మమ్ముల తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా విజయనగరానికి చెందిన అల్లాడ త్రినాథరావు, అనకాపల్లికి చెందిన అలక రాజు, గాజువాకకు చెందిన ఏలేటి రోజా, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎన్.సుగుణేశ్వరి, సహాయ కార్యదర్శిగా లోగిస గణేష్, వీరితోపాటు 9 మంది కార్యవర్గ సభ్యులు, ఈసీ మెంబర్లు, కో కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి చేత ప్రమాణ స్వీకారం, ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో బెహరా ఆస్పత్రి ఎండీ బెహరా రవితేజ, లోక్‌సత్తా పార్టీ నాయకుడు విశెట్టి బాబ్జీ, ఫెంపా రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎస్ఎల్ రావు, సంఘం న్యాయ సలహాదారులు కె.పి.దేశాయ్, ముఖ్య సలహాదారుడు మమ్ముల తిరుపతిరావు, అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కోన ప్రకాశరావు, వి డెంటల్ కేర్ ఎండీ కె.ఎం.కె.రమేష్ పాల్గొన్నారు.

ఏయూ సంగీత విభాగంలో 3, 4 తేదీల్లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగంలో వచ్చేనెల 3, 4 తేదీలలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటశాల వెంకటేశ్వరరావులపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ఆచార్య ఎ.అనూరాధ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఘంటశాల, సాలూరి స్వరపరిచిన సంగీతంపై అతిథులు ప్రసంగాలు ఉంటాయని చెప్పారు.

ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఈ ఇద్దరు సంగీత దర్శకులను స్మరించుకుంటూ, వారి సేవలను గుర్తుచేస్తూ భవిష్యత్ తరానికి వారి సంగీత మాధుర్యాన్ని అందించడం సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. విజయనగరం మహారాజ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు బి.ఎ.నారాయణ ఈ సదస్సులో పాల్గొని తన అనుభవాలను పంచుకుంటారన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

- 26వ వార్డులో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త


ఎన్జీజీవోస్ కాలనీ ఆరోగ్య కేంద్రం సమీపంలో పేరుకుపోయిన చెత్త


శంకువానిపాలెం గెడ్డ వద్ద చెత్త కుప్ప

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఇంటింటా చెత్త సేకరణ, చెత్త తరలింపు సక్రమంగా జరగడం లేదని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ సరిగ్గా జరగ పోవడం వల్ల ఎక్కడ పడితే అక్కడ చెత్త పడవేస్తున్నారు. రోడ్డు పక్కన, ప్రధాన కూడళ్ల వద్ద చెత్త కుప్పలు నిత్యం దర్శనమిస్తున్నాయి. ఎన్జీజీవోస్ కాలనీలోని ఆరోగ్య కేంద్రం సమీపంలో చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయి రోత పుట్టిస్తోంది. వార్డు కార్పొరేటర్ కార్యాలయానికి సమీపంలో శంఖువానిపాలెం గెడ్డ వద్ద చెత్త కుప్ప దర్శనమిస్తోంది. గెడ్డలో సైతం పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుధ్య అధికారులు దృష్టి సారించి వార్డులో మెరుగైన పారిశుధ్యం కోసం తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


శంకువానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

మద్రిపాలెం: సేంద్రీయ వ్యవసాయాన్ని, రైతులను ప్రోత్సహించాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మురళీనగర్ మసీదు దరి బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు, జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వంశీ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయిక, అల్పాహార విందు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది మేధావులు ఉన్న భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే నినాదంతో భారతదేశాన్ని గొప్ప దేశంగా నిర్మించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని కొనియాడారు. అలాగే విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని సూచించారు. మహిళలను గౌరవిస్తే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. తాను వివిధ హోదాల్లో ఉమ్మడి రాష్ట్రాల్లో పనిచేశానని, రెండు రాష్ట్రాలు విడిపోవడం బాధ కలిగించినప్పటికీ రాష్ట్రాలు రెండూ కలిసికట్టుగా ఉండడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు, ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, బీజేపీ నాయకుడు అప్పలకొండ పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పాభిషేకం


పుష్పాల అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవారికి పుష్పార్చన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు వివిధ రకాల పుష్పాల అలంకరణలో కనువిందు చేశారు. 75 కేజీల చామంతి, గులాబి, కనకాంబరాలు తదితర పుష్పాలను స్వామివారికి అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పుష్పార్చన అనంతరం యాగశాలార్చన, నిత్య పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏజీకేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు, జిజా వల్సరాజ్, సుగంధి తదితరులు

బీచ్ రోడ్డు: క్యాన్సర్ రోగులకు నిధుల సేకరణలో భాగంగా వచ్చేనెల 18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి మీనాక్షి తెలిపారు. సోమవారం నగరంలోని ఒక హోటల్‌లో ప్రదర్శన పోస్టర్‌ను ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు, వీసీసీఐ ఉమెన్స్ వింగ్ అధ్యక్షుడు జిజా వల్సరాజ్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ మెడికల్ డైరెక్టర్ సుగంధి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ ఏడుగురు సంగీతకారులు, నృత్యాకారులతో కూడిన అంతర్జాతీయ బృందంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన విరాళాలను దేశ వ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం 93486 23225, 99496 27222 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

ముగిసిన భాగవత సప్తాహం


ప్రవచిస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న భాగవత సప్తాహం సోమవారంతో ముగిసింది. చివరి రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణంలో బృందావనం విశేషాలను, గోపికల మధుర భక్తిని వివరిస్తూ పోతన పద్యాలను మధురంగా ఆలపించారు. రాధాదేవి భక్తిని ప్రేమతత్వాన్ని సరళ సుందరంగా విశ్లేషించారు. రాధాకృష్ణ లీలల్ని, కంస వధ, కాలయవనుల వినాశనాన్ని ఆసక్తికరంగా వివరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద స్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణం నేడు..

లలితా పీఠం దర్బారు హాల్లో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు రుక్మిణీ సహిత శ్రీకృష్ణ కల్యాణం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ముందుగా ప్రియాంక భరతనాట్యంతో అలరిస్తుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించి తరించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు చర్యలు


బాపూజీనగర్‌లో మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం బాపూజీనగర్‌లో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. బాపూజీనగర్ వాటర్ ట్యాంక్ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అక్కడ కొందరు చేరి మద్యం, డ్రగ్స్ సేవిస్తూ వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో భయాందోళనలకు గురైన స్థానిక మహిళలు ఈ సమస్యను కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆమె సోమవారం బాపూజీనగర్‌లో పర్యటించారు. వాటర్ ట్యాంక్ ప్రాంతంలో మద్యం బాటిళ్లు, డ్రగ్స్ సిరెంజ్‌లు పడి ఉండటాన్ని గమనించి కంచరపాలెం పోలీసులు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్థానికులకు కార్పొరేటర్ కవిత హామీ ఇచ్చారు.

జాతి నిర్మాణమే యువత ధ్యేయం



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి భాగ్యలక్ష్మి


ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు

మల్కాపురం: విభిన్న మతాలు, కులాలు, వర్గాలు, వర్ణాలు, ప్రాంతాలు, భాషలకు నిలయమైన భారత దేశంలో ఐక్యతను నింపి జాతిని నిర్మించడమే యువత ధ్యేయం కావాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా 14వ నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా ఆమె దేశభక్తి–జాతి నిర్మాణం అనే అంశంపై ప్రసంగించారు. యువతకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పందుల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

డాబాగార్డెన్స్: నగర పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తున్న పందుల నిర్మూలనకు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలో భారీ స్థాయిలో పందుల కాల్చివేతతో పాటు నగరం నుంచి తరలింపు కార్యక్రమం చేపట్టినట్టు సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. పెంపకందారులను పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని, అందుకు కఠిన చర్యలు చేపట్టామన్నారు. గాజువాక, జ్ఞానాపురం, మధురవాడ తదితర ప్రాంతాల్లో ఆర్మ్ రిజర్వ్‌డ్ పోలీసుల సహకారంతో పులివెందుల జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన 8 బృందాల ద్వారా సుమారు 621 వరకు పందులను పట్టుకుని ఇతర రాష్ట్రాలకు తరలించామని చెప్పారు. మరో 252 పందులను కాల్చి చంపామన్నారు. జీ–20 సదస్సు మార్చి నెలలో జరుగుతున్న దృష్ట్యా నగరం నుంచి పందులు పూర్తిగా నిర్మూలిస్తామని, కొంత మంది పెంపకందారులు ఇప్పటికే పందులను బయటకు తరలిస్తున్నారని వివరించారు. విధులకు ఆటంకం కలిగిస్తే పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని డాక్టర్ కిషోర్ హెచ్చరించారు.